# రొట్టెముక్క

రాజసేనరావుగారి మందులషాపు వెనగ్గదిలో డాక్టరూ, మూర్తి కవీ, యువక లీడరూ, తీరుబాటుగా సిగరెట్లు కాలుస్తున్నారు. రాత్రి ఎనిమిది గంటలవుతుంది. దిళ్ళు వేసిన కొత్త బెత్తు కుర్చీల్లో ముగ్గురూ ఈజీగా కాళ్లు జాచుకు్కూర్చున్నారు. పైన పంకా అదేదో పెనుపురుగులా తిరుగుతోంది. గోడని పాములాటి వంకీకి తగిల్చిన జోడు విద్యుద్దీపాలు విషనేత్రాల్లా మెరుస్తున్నాయి. దీపాలకింద గోడని మందుల కంపెనీవారి కాలెండర్ మీద ఊర్వశిలాటి నవ్వొకామె నాగమోహిన్లా నవ్వుతోంది. మిగతా మూడుగోడల్నీ అందమైన ఆడవాళ్ళ బొమ్మలు మూడు అందంగా నిల్చున్నాయి. అందులో ఒకామె ముఖం అతి మోహనంగా ఉంది. రెండో ఆమె గుండెలు జోడు కొండల్లా లేచేయి. మూడో ఆమెకి కళ్ళూ కాళ్లూ చేతులే ప్రధానంగా కనిపిస్తున్నాయి. అదొక దక్షిణాది నెరజాణ నృత్య భంగిమ. గదినిండా రకరకాల మందువాసన పల్చ పల్చగా అలుముకొంది. గదంతా చాలా చల్లగా ఉంది.

ముందువైపున్న షాపులో పని తొందర్లో ఉన్నాడు రాజసేన రావు. అతనికి యాభయ్యేళ్ళు, మిలిటరీ మీసవూఁ ఉన్నాయి. బాగా బలిసిన ముసురు గెద్దలా వుంటాడతను. ఆకలీ, ఆడాకలీ, డబ్బాకలీ అతనికి చాలా ఎక్కువ. మందాకలికి అతని కడుపుని మించిన కడుపు మరేదీ కనిపించడం కష్టం. షాపు మూసేక సరిగ్గా తొమ్మిది గంటలకి వెనగ్గదికి వచ్చి "చేరుతాను కదూ! అందాకా ఎక్స్‌క్యూజ్ చెయ్యండి" అని చెప్పివచ్చి బంట్రోతుని దగ్గిరగా పిల్చి పన్లు బెత్తాయించేడతను.

"పంతుల్దగ్గిరికి వెళ్ళి ఫారిన్ స్టఫ్ ఏమంటే అది— బ్రాందీ మాత్రం ఒద్దు. వెధవ సరుకు మనద్గిరే ఉంది— ముఖ్యంగా విస్కీ చూడమను. అది లేకపోతే జిన్ను. అంతే! ఏదైనాసరే రెండు బాటిల్స్ ఇమ్మను. లేకపోతే ఇదొకటీ అదొకటీ అయినా ఇమ్మను. నేను స్పెషల్‌గా చెప్పేనన్చెప్పు. బేగిరా."

ఇవాల్టి పార్టీకి మదుపు మూర్తికవిది. కాని, సరుకుమాస్టర్ పనికి రాజసేనరావు తప్ప అంత అనుభవశాలి మరోళ్ళేడు.

"అన్నట్టోరే సూరీ! దార్లోనే ప్రియబాంధవీ రెస్టరెంట్ కెళ్ళి ఎగ్ ఫ్రైడ్ రైస్ నాలుగు ప్లేటు— పైని మరొకటి కూడా ఉణ్నీ— అయిదు ప్లేట్లు ఫిష్ మసాలా, ఎందుకైనా మంచిది నాలుగు మిల్క్ బ్రెడ్, డజను డబుల్ ఆమ్లెట్స్, సరిగ్గా తొమ్మిదికి ఇక్కడికి పంపించమన్చెప్పు. ఉండు, చీటీ ఇస్తాను. ఆ తరవాత ఆ ఊపునే ఐసూ సోడా కూడా బైంకి ఒచ్చి ఏర్పాటు చూడు."

వెనగ్గది చలవలో వెయిట్ చేస్తూన్న డాక్టరూ, మూర్తికవీ, యువక లీడరూ అక్కడి వెలుగులో జిగజిగ మెరుస్తున్నారు. తోమిన ఇత్తడి గుండులా ఉన్నాడు డాక్టరు; ఎఱ్ఱగా గరుగ్గా అనాస కాయలా ఉన్నాడు యువక లీడరు, తవ తవ లాడుతూన్న పనసతొన్లా ఉన్నాడు మూర్తికవి.

తన తొలి వలపుల రోజుల్లో తన కొకసారి (ఒక ఎఫేర్లో) నడ్డి ఏ మాదిరిగా విరగబోయిందో, ఆ ప్రమాదంలోంచి తను ఏ విధంగా ఏ ఉపాయంవల్ల బైటపడ్డాడో ఆ కథంతా చాలా చక్కగా తన నొక గంధోళిగాడికింద చిత్రించుకొని చాలా విట్టీగా చెప్తున్నాడు మూర్తికవి. అదంతా డాక్టర్‌గార్ని నవ్వించి ఆనర్ చేదామనే ఉద్దేశంతోనే అతను చెప్తున్నాడని డాక్టర్‌గారికి తెలుసు. సెక్సుఫీల్డు డాక్టర్ గారి స్పెషల్ ఫీల్డు, అందులో అతను రాజు. కాని, విదూషకులకి రాజులు కొంత చను విస్తారు కాబట్టి, మూర్తికవి చెప్పే వృత్తాంతం వింటూ, నక్క జిత్తులు చూసి పులి నవ్వినట్టు టాలరెంట్‌గా నవ్వుతున్నారు డాక్టర్‌గారు.

మూర్తికవికి తొలివలపు స్టేజి దాటిపోయి చాలాకాల మయింది. నలభయ్యేళ్లు దగ్గిరొస్తున్నా యతనికి. చాలాకాలంవరకూ పంచెల కవిగా ఉన్నప్పటికీ నాలుగైదేళ్ళయి మాత్రం అతను సూటుకవిగా మారేడు. ఇటీవల అప్పటప్పట అమెరికన్ స్లాక్స్ కూడా—ఈ రోజు లాగ—తొడుగుతున్నాడు. నాజూకైన ఆడదాన్లా అతను చాలా చక్కగా ఉంటాడు. ఈ మధ్య బాగా వళ్ళు పెంచి ముద్దుగా సిరి బొజ్జకూడా పెంచాడు. చిన్నప్పణ్నించీ కూడా గుండ్రని మనిషే అవడంచేత అతన్ని బాగాఎరిగినవాళ్లూ అతనంటే పడనివాళ్లూ కూడా అతన్ని "దిబ్బ కవి" అని రిఫర్ చేస్తారు. లోగడ అతను ఊహా కన్యల మబ్బు పైటల గురించీ, కాపుకన్నియల కనుల మెరపుల గురించీ సుతిమెత్తని గేయాలు రాసేడేకాని అవి బహుళ ప్రజాదరణ పొందలేదు. అటుపిమ్మట అతను ఆకలితాపాన్నీ విరాహ తాపాన్నీ రెండింటినీ మిళాయించి సొంపైన శ్లేష కావ్యం ఒకటి రచించేడు. అందులో ఏ పద్యానికి ఆ పద్యం ఆకలికీ అన్వయించుకో వచ్చును, విరహానికీ అన్వయించుకో వచ్చును. ఆ కావ్యాన్ని—పండిత పామరులో లేక పామర పండితులో అంటారు_

ముఖ్యంగా, వాళ్ళంతా చాలా మెచ్చుకున్నారు. తన రచనల్లో అదే నిలుస్తుం దని అతను మోడెస్ట్‌గానూ గర్వంతోనూ కూడా చెప్పు కుంటాడు. ఆ కావ్యంతో మూర్తికవి అటు డొక్కలు మాడినవాళ్ళ ల్లోనూ ఇటు కడుపులు పెంచిన వాళ్ళల్లోనూ, ఉభయుల్లోకూడా, ఒకే సారి పాప్యులర్ అయేడు. పెద్ద పెద్దవాళ్ళు అతనికి ఉత్తరాలు రాయ డవూ, కనిపించినప్పు డతణ్ని పలకరించడవూ, మొదలెట్టేరు. దాన్తో కవికి కను విప్పయింది. హై సొసైటీలో ప్రవేశించడానికి డబ్బుదారి లేనప్పుడు ఆర్టొక అడ్డుదారిగా పని చేస్తుందని అతను తెలుసుకోగలిగేడు. పెద్దలుకూడా ఈ "దిబ్బడు" పనికొస్తాడని పసి గట్టగలిగేరు. లంచాలతో రెండు డాబాలు మాత్రం కొని చనిపోయిన హెడ్ గుమాస్తా కొడుకు మూర్తికవి. లలిత లలితంగా సరస సర సంగా తీపి తీపి "ఆకలి / విరహం" కావ్యం రచించేదాకా అతనికి సంఘంలో పెద్ద స్టాటస్ లేదు. అంతవరకూ అతనికి దొరికిన ప్రియురాళ్ళంతా చవకబారు గులకరాళ్ళ వంటివారే దొరికేరు. స్థాయితో బాటు అవకాశాలుకూడా పెరుగుతా యని తెలుసుకొని అతను చాలా పొంగిపోయాడు. "కవిత్వం పలుకుబడి"తో పావలా క్లాసు నించి రూపాయి పావలా క్లాసుకి మారగలిగినందు కతను ఓ రోజు రాత్రి మంచం మీద కూర్చొని సంతోషం పట్టజాలక చప్పట్లు కొట్టేడు. అటు తరవాత జనరల్ ఎన్నికల్లో ఒక పార్లమెంటు అభ్యర్థి తరపున అతను గట్టిగా నిలబడి ఎదర పార్టీమీద అద్భుతంగా బులెటిన్ల వర్షం కురిపిం చగా ఈయన పట్టిన (ఈయన్ని పట్టిన) బడాబాబు ఎన్నికలో అఖండ విజయం సంపాదించడం జరిగింది. బడాబాబు ఇప్పుడు మూర్తికవి లేన్దే అట్టేసేపు ఉండలేడు. ఈ రాత్రి మందు పార్టీకి మదుపు సొమ్ము నవ్వుతూ నేస్తం తిట్లు తిడుతూ మూర్తికవికి బడాబాబే ఇచ్చేడు. కవి గారికి ఈమధ్య శుక్రుళ్ళో బుధుడో లేక బుధుళ్ళో శుక్రుడో నడుస్తు

న్నాట్ట, "ఆర్టూ, ఆడదీ, డబ్బూ, వ్యాపారం – వేటికీ లోటుండదు. ఫరవాలేదు. దశ పరిగెడుతుంది", అన్నాట్ట అతని జాతకంచూసి ఎవరో పండితుడు, ఆనాటి కప్పుడే అతని దశ పరిగెడుతూనే ఉంది. ఈ మధ్య అతను చిత్ర కవిత్వం చెప్తూ జోకుల గేయాలు రాస్తూ వాటికి చిత్రంగా "జోకేయాలు" అని పేరు పెట్టేడు. అవిప్పుడు చాలా పాప్యులర్‌గా ఉన్నాయి. స్త్రీ రంగంలో అతనికి ఈజీగా రొమాన్సులు నడపగలిగిన అవకాశవూ కాలవూ కూడా దాటిపోయేయి. తాగి తాగి ఘోరకృత్యాలు చెయ్యగలిగిన ఆడవాళ్ళ తప్ప వేరు రకాలవాళ్ళ అతన్ని కవ్వించలేకుండా ఉన్నారు. అయినా, వాళ్ళల్లో నాణ్యమైన "క్లాసు సరుకు"ని డబ్బిచ్చి తెచ్చుకో గలిగిన మేరకి మాత్రం అతని స్తోమత పెరగడం తన అదృష్టమనీ జాతక ప్రభావమేననీ అతను భావిస్తున్నాడు. ఈ మధ్య ఒక మంచి బట్టల దుకాణంలో అతను అర్ధవాటా తీసుకున్నాడు; గవర్నమెంటువార్కి రాయి సప్లయ్ చేసే కాంట్రాక్టు కూడా సంపాదించేడు. తదుపరి– నెల జీతాలిచ్చుకొని కాబూలీవాళ్ళని కాపలా పెట్టుకొనే గుమాస్తాలూ, జీతాలు కట్టలేని విద్యార్థులూ, ఉద్యోగాల్లేని యువకులూ, కోపాలచేతా "అజ్ఞానం" చేతా "తప్పుదార్లు" పట్టకుండా నవ్వుదార్లు పట్టడానికి అనువుగానూ, ఆఫీసర్ల భార్యలూ, పెద్దల పిల్లలూ సినీమాలు చూడనప్పుడూ. ఆటలకీ పాటలకీ క్లబ్బులకీ వెళ్ళనప్పుడూ ఊసు పుచ్చుకొందికి చక్కగానూ, ఫస్టు క్లాసుల్లో (లేక, విమానాల్లో) ప్రయాణించినప్పుడు తోచడానికి హాయిగా వీలుగా ఉండేదుగ్గానూ పెద్దల ప్రోత్సాహంతో మదుపుతో ఆదరణతో ఆశీస్సులతో మూర్తికవి "హాస్యనగరి" అనే పత్రిక స్థాపించి నడిపిస్తున్నాడు. సాంఘిక మర్యాదలకి భంగం రాకుండా అందులో సెక్సు పల్చని పైట వేసుకొంటుంది; అందుకు భంగంలేదు కాబట్టి హాస్యం బట్ట విప్పుకొంటుంది. రాష్ట్రిస్థాయిలో కవిగారి పలుకుబడి పెరుగు

తోందని అతనికి వార్తలొస్తున్నాయి. ప్రస్తుతం ఏదైనా కల్చరల్ డెలిగేషన్తో కనీసం కాంగో అయినా వెళ్దామనే తాపత్రయంతో సరదాతో ఉన్నాడతను. "ఒరే, కవీ! ఎలా వెళ్తోందిరా లైఫూ?" అన్చెప్పి బతికి చెడిపోయిన అతని చిననాటి స్నేహితు డొకడు ఇటీవల ప్రశ్నించగా 'నీమీద వేసిన విట్టులా ఫస్టుగా వెళ్తోంది. చెడిపోను. ఆశ పడకు" అన్నాడు మూర్తికవి.

డాక్టర్ గారికూడా సంభయ్యేళ్ళుండ వచ్చు. కోడిగుడ్డు ఆకారంలో ఉన్న అతని తల ఒకవెంట్రుకైనా లేకుండా ధగధగా ఎలా మెరుస్తుందో, వళ్ళంతా కూడా అలాగే నున్నగా పచ్చగా మెరుస్తుంది. ఇండియా మంగోలియా ఇంగ్లీషు కలయికలా ఉంటా డతను. అతను వైద్యుడుకాడు. ఫిజిక్స్లో అతనికి డాక్టరేట్ డిగ్రీ ఉంది. కొన్నాళ్ళు ఏదో ఫారిన్ యూనివర్శిటీలో రీడర్గా పనిచేసి మానేసి స్వదేశం వచ్చి కొన్నాళ్ళు ప్రొఫెసర్గా ఉండి ప్రస్తుతం లక్షలమీద వ్యాపారం చేస్తున్నాడు. ఇప్పుడు ఆ వ్యాపారానికి "టేక్ ఆఫ్" స్టేజి దాటిపోయి దానంతట అదే నడుస్తోంది. అతని కసలు ఉద్యోగం కాని, వ్యాపారం కాని చెయ్యవలసిన అవసరం లేదు; అయినా చేసేడు, చేస్తున్నాడు. అదే అతన్లో ఒక గొప్ప విశేషం—ఇంట్లో బాత్రూంకి వెళ్ళాలంటే కార్లోనో ప్లేన్లోనో వెళ్ళగల తాహతుం దతనికి, ("మజాకా కాదు!") అతని తండ్రి ఒక ప్రఖ్యాతి చెందిన దివాన్గారి కొడుకు. దివాన్గారి కొడుకే కాని అతను రాజావారికే పుట్టే డనీ అందు చేతనే ఈ డాక్టరు ఆ "రాజా తాతవార్లాగే" ఉంటాడనీ, అందుకు మరో దాఖలా అక్కర్లేదనీ చాలా మంది అంటారు. ఆ విషయం డాక్టర్కి బాగా తెలుసు. కాని, అందుగురించి అతనికి ఏ విధమైన ఇమోషనూ లేదు. కాని ఎవరైనా ఆ సంగతి హింట్ చేసిన వాసన వేసినా సరే అతను ప్రళయరుద్రు

డయిపోయినట్టు నటించగలడు. అతను పెళ్ళి చేసుకోలేదు. అతన్ని చాలా పెద్ద వంశాల స్త్రీలు చాలామంది గాఢంగా ప్రేమించే రట. తన దగ్గిరికి వచ్చిన స్త్రీల నతను చిత్ర విచిత్రంగా హింసలు పెట్టగల డని ఒక వాడుక ఉంది, ఆ వాడుకబట్టి కొంత మంది పెద్దింటి ఆడవాళ్ళు అతనిమీద మోజుపడ్డం జరిగింది. "మగవాడిమీద మోజుకొద్దీ ఆడది ఎంత దూరం వెళ్ళగలదు ?" అనే ప్రశ్నకి సమాధానం తెలుసుకుందా మనే ప్యూర్ సైంటిఫిక్ స్పిరిట్‌తో అతను కొన్ని కాపరాలు చెడ గొట్టే డని కొంద రంటారు. ఉండడం మాత్రం అతనికి తమాషా సరదా లున్నాయి. మన్దేశంలో ప్రొఫెసర్‌గా ఉన్నప్పుడత నొక సారి ఒక స్టూడెంట్‌ని మాటల్లో పెట్టి, "నీకు ఫస్ట్‌క్లాస్ ఇచ్చినా నువ్వు గోచీ కట్టుకు మార్కెట్ దగ్గిర కూలివాళ్ళా నిల్చో లేవు!" అని ఛాలెంజి చేసేట్ట. ఫస్ట్‌క్లాస్ ఇస్తా నని హామీ ఇవ్వండి. నే నాపని మీకు చేసి చూపిస్తాను" అన్నాట్ట ఆ యూనివర్సిటీ విద్యార్థి. తరవాత ఆ స్టూడెంటు ఆ ప్రకారం చేసి పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణు డయే డని కొంత మందీ అవలేదని కొంతమందీ అంటారు. డాక్టర్ మాత్రం అటువంటి గమ్మత్తయిన కార్యక్రమాలు జరిపించి ఆనందిస్తూ ఉంటాడు. ఆవిధంగా, అత నొకసారి ఒకడికి అయిదురూపాయ లిచ్చి ఎండలో గంటసేపు మోకాళ్ళమీద నిలబెట్టించేడు; పదిరూపాయ లిచ్చి పావుగంట సేపు ఒకణ్ని పబ్లిక్ రోడ్డుమీద వెర్రివాళ్ళా కేకలు వేయిం చేడు. చెరో నాలుగూ ఒక ఆడా మగాకి ఇచ్చి తన ఎదటనే అర గంట సేపు వాళ్ళిద్దర్నీ ముద్దులాడించేడు; పాతిక రూపాయి లిచ్చి ఓ ఆడమనిషిని అర్ధరాత్రి బీచిని నగ్నంగా పరిగెట్టించేడు. అమాదిరిగా చాలా మందిచేత చాలా పన్లు చేయించే డతను. అతనికి వెర్రుందేమో నని అతన్ని సరిగా తెలియనివాళ్ళు అనుకోవడానికి అవకాశం ఉంది. కాని, అతనికి వెర్రిలేదు; లోకంలో నూటికి తొంభై మంది గడ్డిపరకలే

ననే భావం ఉంది. "ఫలానావాడి చేత డబ్బుకోసం ఫలానా పని చేయించగల న్యూసుకో!" అని తన స్నేహబృందంతో పందెంవేసి, పందెం నెగ్గేక ఆ సంగతంతా ఫ్రెండ్స్‌తో చెప్పి, నవ్వుతూ నవ్వించగల డతను. అంతెందుకు?! "అయిదు రూపాయలకంటె తక్కువిచ్చి హత్య చేయించగలను" అని అప్పుడప్పుడు ఛాలెంజ్ చేస్తూ ఉంటాడే కాని అందాకా అత నింకా వెళ్ళినట్టులేదు. కుక్కల్లో జాతికుక్కలూ ఊరకుక్కలూ ఉన్నట్టే, మనుషుల్లోకూడా ఎక్కువ్వాళ్ళూ పాలకులూ పాలితులూ ఉంటారని అతనికి ఖచ్చితమైన నమ్మకం ఉంది. తక్కువ్వాళ్ళ కంపెనీలో తాగితే ఎలా ఉంటుందో తెలుసుకుందామనే ప్యూర్ శాస్త్రీయ దృక్పథంతో అత నీ రాత్రి మూర్తికవీ వగైరాలతో కలసి కూర్చుని తాగడానికి వప్పుకున్నాడు. లోగడ ఒకసారి కవిని ఏదో సభలో చూసి నప్పుడు, "వీణ్ని నే చెప్పినట్టు గెంతించగల్ను"అని డాక్టరు తన ఫ్రెండ్స్‌తో పందెం వేసేడు. ఈ రోజున ఆ పందెం నెగ్గుదామనేసరదాలో కూడా ఉన్నాడతను. అతనికి దేశంలోనే చాలా పలుకుబడి ఉన్నపుడు సిటీలో రాచమర్యాదలు జరగడంలో ఆశ్చర్యం లేదు. అతని గురించి కథ లన్నీ విన్నపుడు లోగడ మూర్తికవి అతన్నిచూసి అసహ్యించుకొన్నట్టుగా కనిపించేవాడు. అతన్తో పరిచయం అయాక మూర్తికవికి అతన్లో గొప్ప సరసత కనిపించింది. అంతటి సరసుడు యువకలీడర్తో స్నేహం చేసేడూ అంటే తనలాంటివాడికి అతణ్ని ఇంకా బాగా మచ్చిక చేసుకొందికి అవకాశం ఉందని ఆశిస్తూ కూర్చున్నాడు.

యువకలీడర్‌కి ముప్ఫయ్యేళ్ళు దాటుందొచ్చు. తొండదశలో ఉన్నప్పు డతన్ని కేడీలూ, బ్రోకర్లూ, పోలీసులూ మాత్రం ఎరుగుదురు. రాంబాబు కిల్లీ కొట్టు దగ్గిర బ్రాకెట్ల చీట్లు రాస్తూ కూర్చొనేవా

డతను. తరువాత అలా ఉన్నట్టుండి అద్భుతంగా ఒకరోజున మున్సిపల్ కవున్సిలరయి అతను ఊసరవిల్లిగా మారిపోయేడు. ఛేర్మన్ ఎన్నికలో అతను రెండువేలు రొక్కం ఛాన్సు కొట్టే డని ప్రతీతి. ఈ మధ్యనే రెండుమూడు రకాల ఏజెన్సీలు తీసుకున్నాడు, కథ బాగా నడిపిస్తున్నాడు. అతను "గ్రామ్యం" "శిష్టవ్యావహారికం" రెండూ జోడించి మాంసానికి మసాలా కలిపివేపినట్టు మాటాడుతూ ఉంటాడు. ఆ భాషలో ప్రతి సభలోనూ అతను నిర్భయంగా అందరికీ సరదా కలిగేలా మాట్లాడగలడు. అతనికి "సిగ్గూ, లజ్జా" అనే విశేషాలతో అట్టే పరిచయం ఉన్నట్టు కనిపించదు; నలుగుర్లోనూ నగ్నంగా స్నానం చెయ్యగలడు; పది మంది ముందు ఆడదాన్తో పడుకోగలడు. ఆనర్స్ విద్యార్థుల్లో, ఇంజనీరింగ్ గ్రూపులో, మెడికల్ బ్యాచీలో "లా" గ్యాంగ్‌లో చాలామంది అతన్ని హీరోగా చూసుకుంటారు. యువక లీడర్‌తో పరిచయం సంపాదించిన స్టూడెంట్‌కి స్టాటస్ పెరిగిందన్న మాటే. వాళ్ళంతా అతనికి "రసికల్లీడరు" అనే బిరుదుకూడా అభిమానంతో ఇచ్చేరు. ఊళ్ళోకి దిగుమతయ్యే ప్రతి "ఫిగర్" తోనూ పరిచయం ఉండడమేకాకుండా, చాలా మంది పొలిటికల్ ఫిగర్స్‌తో కూడా అతను స్నేహం సంపాదించుకున్నాడు. ఆఫిగర్స్‌కీ ఈ ఫిగర్స్‌కీ మధ్య అతను లంకెగా ఉండగలడు. చాలా పంచాయతీ సమితుల అధ్యక్షులవీ, కొంతమంది ఎమ్మెల్యేలవీ నిజజీవితాలు అతనికి బాగా తెలుసు. ఆ జీవిత విశేషాలకి చిలవలూ పలవలూ చెక్కి వాటిగురించి విట్టీగా నటిస్తూ చెప్తూ ఎంతటి మంత్రినైనా, మర్చెంట్ ప్రిన్స్‌నయినా అతను ఇట్టే ఆకర్షించగలడు. దేశీయమైన బూతుడాన్సులు చేసే అలవాటు చిన్నప్పు డతనికి బాగా ఉండడంచేత రాక్ అన్డ్ రోల్, ట్విస్ వగైరా పాశ్చాత్యనృత్య విన్యాసాలు అతనికి ఈజీగా పట్టుబడ్డాయి.

అది అతన్లో ఉన్న ప్రత్యేకాకర్షణ. సినిమాల్లో నటించే పెద్ద పెద్ద హాస్యనటుల్ని అతి సులభంగా ఇమిటేట్ చేసి అందర్నీ అరనిమిషంలో నవ్వించగల శక్తుం దతనికి. అందుచేత పెద్దల్ని మెప్పించే పోటీలో కవిమీద లీడరు మెరిగేస్తూ ఉంటాడు. యువక లీడరు మంచి మగసిరి కలవా డనే గట్టి ప్రచారం ఒకటి అమల్లో ఉంది; ఊళ్ళో అందరూ కావాలనుకున్న రిచ్ విడో ఒకామె అతన్ని ఉంచుకున్నాదన్న గౌరవం, మర్యాదా, పలుకుబడికూడా అతనికున్నాయి. మూర్తికవి పురుష లక్షణాలగురించి అటువంటి సదభిప్రాయాలెక్కడా ప్రచారంలో లేవు. పెద్దల్తో కవి ఉన్నప్పుడు లీడరొచ్చేడంటే వాళ్ళని అయస్కాంతంలా ఒక లాగు లాగేసేడన్నమాటే. అందుచేత మూర్తి కొంచెం ఉడుక్కొని లీడర్ని "పెద్దలకి ఫిగర్స్ పట్టుకెళ్ళి పలుకుబడి సంపాదించేవు" అని చెప్తుతూ ఉంటాడు. "నువ్వు పజ్జాలు పట్టుకెళ్ళి తారుస్తావు, నీకూ నాకూ తేడా ఏంటిగురూ !" అంటాడు అందుకు జవాబుగా లీడరు. వాళ్ళిద్దరూ స్నేహితులేకాని ఇద్దరి మధ్యా ప్రొఫెషనల్ రైవల్రీ ఉంది. యువకలీడరు "జాతీయ పట్టణయువక లీగ్"కి అధ్యక్షుడు; రౌడీలకి రింగులీడరు. మ ప్పాట్లా గొడ్డుమాంసంతిని అరిగించుకో గలిగేవాళ్ళా అతను చాలాదిట్టంగా ఉంటాడు. ఎప్పుడూ అమెరికన్ జాకెట్టూ పాంటూ తొడుక్కుంటాడు; ఫైలొకటి చేత్తో ఎప్పుడూ పట్టుకుంటాడు. తెలుగు రాయడం ఓ మాదిరిగా వచ్చు నతనికి. ఇంగ్లీషులో "తల, నల, కుండ, పండు" మేరకి ప్రవేశం ఉంది. అతనికి మానవుల్లో మహాత్ములున్నారనే నమ్మకం ఏ కోశానా లేదు, స్వంత బేరానికి వచ్చే సరికి ప్రతివాడూ దొంగా పశువూ అనే అతని అభిప్రాయం. దేవేంద్రుణ్ని తీసుకొచ్చి చూపిస్తే, "వీడుదొంగా ముండల ముఠాకోరూను !" అనగల డతను.

తన తొలివలపు ప్రమాదం గురించి చెప్పడం పూర్తయాక, "ఉండండి! మన అరేంజ్‌మెంట్స్ ఎందాక ఒచ్చేయో చూసొస్తాను" అని చెప్పి, రాజసేన రావుతో మాట్లాడ్డానికి మూర్తికవి ముందువైపు షాపులోకి వచ్చేసరికి ఓ పాతికేళ్ళ యువకుడు కుడిచేత్తో ఏవో కాయితాలు పట్టుకొని,

"హమ్మ! గురువుగారూ! మీ కోసవేఁ చూస్తున్నాను." అంటూ సరాసరి వెనగ్గది గుమ్మం దగ్గిరికి వచ్చీసేడు. అతన్ని చూసి లోపలికి ఉడాయించేద్దా మనుకున్న మూర్తి నిస్పృహతో లోనికి నడిచేడు. ఆ యువకుణ్ని వీధిలోకి తీసుకు వెళ్ళి మాట్లాడి పంపించేవచ్చుననే ఆలోచన తట్టనందుకు తరువాత చాలా బాధపడ్డాడు.

ఎవరూ రమ్మనకుండానే లోనికి వచ్చిన యువకుడు ఎవరూ కూర్చోమన కుండానే వెళ్ళి ఓ బెత్తుకుర్చీలో కూర్చున్నాడు. డాక్టరతన్ని వింతక్రిమిని చూసినట్టు చూస్తున్నాడు. ఇతన్ని "ఎక్కడ చూసేన్చెప్మా!" అని జ్ఞప్తికి తెచ్చుకొందికి ప్రయత్నిస్తున్నాడు యువక లీడరు. మూర్తికవి చిరాకును దాచుకొంటూ, "ఏం? ఏదైనా పనిమీదొచ్చారా?" అని యువకుణ్ని ప్రశ్నించేడు.

యువకుడి జుట్టుకి నూనెలేదు; గడ్డానికి మూడు రోజులనించైనా రేజరు పడలేదు. అతను తొడుక్కున్న షర్టు పైజమాలు చాకలివాడి కోసం "వళ్ళంతా" దుమ్ముచేసుకు చూస్తున్నాయి. మొన్నటి దినం అన్నంమొహం చూసినవాళ్ళా ఉన్నాడతను. డాక్టర్ని పరికించడంలో, అతను మూర్తికవి వేసిన ప్రశ్న వినిపించుకోలేదు.

మూర్తి "ఈయనతో నాకు మొన్నే పరిచయం అయింది. పేరు మర్చిపోయేను. కథల్రాస్తారు." అన్నాడు యువకుడి గురించి డాక్టరికీ లీడరికీ చెపుతూ కొంచెం క్షమాపణ కోరుకునే స్వరంతో; తరువాత

ఆ యువకుణ్ని. "ఏం ? ఏఁవైఁనా సంగ తుందాండి ?" అని మళ్ళీ అడిగేడుకవి.

"ఆఁ ! ఉందండీ ! కథ రాసేను. మీరు చూడాలి !" అన్నాడు యువకుడు. కుర్చీలో అప్పుడే కూలొ్బంటోన్న కవితో.

"అద్దీ ! పిట్టకత ్రాస్తావు ! కిల్లీల రంగమ్మ అప్ప కొడుకువి ! అవునా ?" అంటూ హుషార్‌గా సరిగ్గా సర్దుక్కూర్చున్నాడు యువక లీడరు.

"అప్పకొడుకునే" అన్నాడు యువకుడు.

"మన కెవర్ని దెలిసినా విత్ రి్ఫెన్స్ టు ఆడోళ్ళే !" అంటూ తన స్పెషాల్టీని నవ్వుతూ చెప్పేడు యువక లీడరు.

"గురువుగారూ ! కథ చదువుతాను. వినాలి !" అన్నాడు కథ కుడు మూర్తితో.

"నా చేతికిచ్చి వెళ్ళండి. చదివి మళ్ళీ మీకు రేపిచ్చేస్తాను." అని తప్పించుకుందామని చూసేడు కవి. డాక్టరు చిరునవ్వు నవ్వుతూ ఏం మాటడకుండా కూర్చున్నాడు.

"అలా కాదు, చాలా చిన్న కథ. అయిదు నిమిషాలైనా పట్టదు. కొంచెం వినేసి తప్పులుంటే చెప్పండి. ప్లీజ్ !" అంటూ పట్టుపట్టేడు కథకుడు.

"థీమ్ ఏఁవిఁటి ?" అంటూ మరింక తప్పదన్నట్టుగా నుదురు పట్టుకున్నాడు మూర్తికవి.

"వింటారు కద !"

"సీరియస్ కథయితే రేపు చదువు కుందాం"

"సీరియసో కాదో, విన్నాక మీరు చెప్పాలి."

"సీరెస్సైతే లాభం నై జాస్తా!" అన్నాడు యువక లీడరు మధ్యలో అడ్డొచ్చి.

"ఏం?" అని అడిగేడు కథకుడు.

"డబ్బు రాలవు.", అంటూ టూకీగా కథకుడికి జవాబు చెప్పి, "మొన్న కాంతామాల్లో సీరెస్ పిచ్చ్రాడింది. దాని పేరేట్రా కపీ!" అని కవి నడిగేడు లీడరు.

"ఏది? అదా! "రక్త ధార"!"

"పేరూ దారా పెద్దవే! కాని, నామ బడా దరిశన్ తోడా! మూడ్రోజు లాడితే పావల్డబ్బులు పలకలేవు. అలాటి పిచ్చర్లు మర్రెం డాడితే చాలు. ఆల్ ప్రొప్రయిటర్గాడు కొంపలంట కోడుపుట్లో బస్తాతో పోయి టీ కొట్టెట్టుకోవాలి; లేపోతే ఓడెక్కి రంగవోఁ సింగపూరో లగాయించాల!" అన్నాడు యువక లీడరు.

"సీరియస్ ఫీమ్స్‌కి ఇవి టైమ్స్‌కావు." అన్నాడు మూర్తి కవి.

"వోటర్ గాళ్ళకి కామిక్కు తప్ప మరేదీ ఎక్కదు," అన్నాడు యువక లీడరు.

"ఎందు కెక్కదు?"

"ప్రజలకి నవ్వు కావాలి కాని, ఏడు పక్కర్లేదు." అన్నాడు కథకుడికి సమాధానంగా మూర్తి కవి.

"అంచేత మన దిబ్బకవిప్పుడు లంజెలమీద తప్ప పతివ్రతల మీద పజ్జ్రాలాయదు" అన్నాడు యువక లీడరు సరదాగా.

కవి కోపంగా చూసేడు. లీడరు "హాఁ! హాఁ!" అన్నాడు.

"సీరియస్‌గా ఉండాలంటే ఏడుస్తూ కూర్చోమని కాదుకద !.... పోన్లెండి....కాని మనం మరి మనం మన .... సంఘంలో దుర్మార్గం గురించి రాస్తేనో ?" అని ప్రశ్నించేడు కథకుడు.

"విలన్‌గాడుకూడా కాసు గ్గుండాల ! అలాగుంటేనే ఆడదానికి ఆడిమీద మోజు" అన్నాడు యువక లీడరు.

"దుర్మార్గం గురించి రాసినా సన్మార్గం గురించి రాసినా సమస్త ఘాతాదులయందూ రచయిత నయగలి గుండాలి ?" అన్నాడు మూర్తి కవి తిరుగులేని పాయింటు గ్రామ్యంగా పలికిస్తూ.

"అంటే దొంగ చెయ్యాల్నయినా మనం ప్రేమించగలగాల!" అన్నాడు యువక లీడరు.

అతని అజ్ఞానానికి మూర్తికవి నవ్వేడు. తరవాత కథకుడితో, "నేనొకటి చెప్తాను వింటారా?" అన్నాడు.

"ఏ(వి(టీ?"

"అసలు మంచి రచన ఏదైనా రాయాలీ అంటే రచయిత రుషి కావాలి."

"శాపాలెట్టే రుషి మాత్రం కాకూడదు" అన్నాడు యువక లీడరు పకపక నవ్వుతూ. మూర్తికవి అతనివైపు సురసుర చూసేడు. కాని ఆ కవి కోపాన్ని లెక్కచెయ్యకుండా, "శాపాలెట్టే రుషిబుర్ర లుంటే మన్లాటి బుర్రలు మిగలవు. నీకు దెబ్బ! నాకు దెబ్బ!" అని విరగబడి నవ్వుతూ, "డాక్టరుబాబోడి గుండుక్కూడా అదే దెబ్బ! శాపం దెబ్బ! శాపం దెబ్బ తక్కువ దెబ్బ కాదు. బలే దెబ్బ! బలే దెబ్బ!" అంటూ విపరీతంగా నవ్వేడు యువక లీడరు.

డాక్టర్ని అతనలా చవగ్గా మాట అనేసినందుకు డాక్టర్‌కి ఎక్కడ కోపం వచ్చి అల్లరవుతుందోనని మూర్తికవి భయపడ్డాడు.

యువక లీడర్ (గాడి) "అడాసిటీ"కి చాలా ఆశ్చర్యపడ్డాడు కూడాను. "యూ టేక్ ఇట్ ఈజీ; ఫర్ మైసెల్ఫ ఐ కెన్ టేక్ ఇట్ ఈజీ" అన్నట్టుగా డాక్టరు అతనివైపు చూసి చిరునవ్వు నవ్వేడు. ఆ నవ్వు చూసి యువకలీడరు ఇంకొంచెం చొరవ తెచ్చుకున్నట్టున్నాడు; అంచేత ఇంకా అలా నవ్వుతూనే కుర్చీలోంచి లేచి డాక్టర్ వెనక్కి వెళ్ళి అతని భుజం మీద గట్టిగా చరిచి, "ఈ గుండు తక్కువ గుండు కాదు పిట్టకవీ! జోగులప్ప కూతురికి పదిచ్చి అయిదు పోజుల్లో ఫొటో తీసిన గుండు కాని ఇది మామూలు అలా టిలాటి అణాపరక గుండు కాదు." అంటూ విరగబడి నవ్వేడు. లీడరు అంత అసందర్భంగా తనని అవమానం చేసినందుకు డాక్టరు బ్రహ్మాండం బద్దలు కొట్టేస్తాడనే అనుకున్నాడు మూర్తికవి.

డాక్టరప్పుడు ప్రమెటిగ్గా లేచి యువక లీడర్ని చెయ్యిపట్టుకు తీసుకువెళ్ళి అతన్ని అతని కుర్చీ దగ్గర నిలబెట్టి "దట్ విల్ డూ" అని చెప్పి, కుర్చీలోకి తోసి, "దట్ ఈజ్ యువర్ ప్లేస్! నౌ యు సిట్ దేర్!" అంటూ చక్కా వచ్చి తన కుర్చీలో కూర్చున్నాడు. అతనికి అంతకంటె ఎక్కువ కోపం రానందుకు చాలా చిరాకు పడ్డాడు మూర్తికవి.

"కోపం ఒచ్చిందేంటి గురూజీ" అని ప్రశ్నించేడు డాక్టర్ని లీడరు.

"అల్లరి చెయ్యకండా అలా కూర్చో, మరేం ఫరవాలేదు" అన్నట్టు చేత్తో సంజ్ఞ చేశాడు డాక్టరు.

మూర్తికవి విసుక్కొంటూ కథకుడి వైపు తిరిగి, "ఏదండీ మీ కథా?" అనడిగేడు.

"ఇదిగో చదువుతాను."

"బేగి చదువు. రాచకార్యానికి మాకు టైమయిపోతాంది" అన్నాడు యువక లీడరు.

కథ తీరా చదవ్వలిసొచ్చేసరికి కథకుడు కొంచెం సిగ్గుపడ్డట్టు న్నాడు.

"సిగ్గు పడతావెందుకు పిట్టకవీ" అన్నాడు యువకలీడరు.

"లేదండీ" అన్నాడు కథకుడు ఇంకొంచెం సిగ్గుపడి.

"ఏంటిలేదు?"

"సిగ్గుట!" అన్నాడు మూర్తికవి.

"సిగ్గెందుకూ?!" అని యువక లీడరు ఆశ్చర్యపోయి, "ఓయ్ రంగప్ప అప్పకొండక! మీటింగులంట మన డిప్పకవి పజ్జాల్చదవడం విన్నావా?" అన్నాడు.

లేదన్నట్టు తల ఊపేడు కథకుడు.

"వినాలినాల! దమ్మిడీ పజ్జం రాసేడంటే దానికి పాలా పాలా సన్నాయి నొక్కుల్నొక్కి మద్దెమద్దె రూపాయంత కేక లేసి సదివే డంటే పబ్లిక్ మంత్రులు ఐసయిపోయి జెజ్జరిల్లిపోయేరన్నమాటే! దాన్తొ మర్నాలుగు అడర్టయిజ్మెంట్లు మనాడు కొట్టేడన్నమాటే! కవులూ లీడర్లూ సిగ్గు లజ్జ లొగ్గెయ్యాల!" అన్నాడు యువక లీడరు నిక్కచ్చిగా.

"ఆ సంగతి నీకు బాగా తెలుసు!" అని లీడర్ని దెప్పి పొడి చేడు మూర్తికవి, వెటకారంగా నవ్వుతూ,

"సిగ్గూ లజ్జా నీకున్నాయేంటి?" అని మూర్తిని తీవ్రంగా ప్రశ్నించేడు లీడరు. అతని కెందుకోగాని అకస్మాత్తుగా కోపం వచ్చింది.

“నా కుండొచ్చు మానొచ్చు. నీకు మాత్రం లేవు.” అన్నాడు కవి.

“మన్లా ఎవడికున్నాయి ? ఏవడికీ లేవు !”

“ఓహో ! ఓహో !”

“నీ యెటకారం వంతా యెగ్గటి మూటగట్టి దాసుకో, డిప్పకవీ! పెద్ద సిగ్గూ లజ్జా మానం అప్మానం ఉన్నట్టు పోజులు కొట్టకు మన్దగ్గిర! ఆ సరుకు మన్లా ఎవడిదగ్గిరా మచ్చుకి లేదు. నీకే సిగ్గుంటే నువ్వా బడా బాబుగాడి కోసరం కాయితాలు ఖరాబు చెయ్యవు; ఎప్పెస్ డబ్బులికి శేతు త్తిప్పుకు తిరగనూ తిరగవు; కర్సులేని ఐక్లాస్ లంజల కోసరం యెయ్యి కళ్ళతో ఎతకనూ ఎతకవు! నాకే సిగ్గుంటే నేను మంగల్షాపుల్దగ్గిరా, కిల్లీ బడ్డీల్దగ్గిరా మామూళ్ళు గుంజను; లంచాలూ లాగను; లీడర్లకి లంజెల్ని తార్సను! ఈ బోడిగుండుకే సిగ్గుంటే తిండిలేని బీద లంజెల్కి డబ్బిచ్చి గుడ్డలిప్పించి బీచంట పరిగెట్టించనూ పరిగెట్టించడు; కంపెనీ అంటూ ఎట్టికూలోడిక్కాణిచ్చి పాలా సరుకు అద్దరూపాయి కమ్మనూ అమ్మడు.; ఆ తరాత క్లబ్బు కెళ్ళి ఇస్కీకొట్టి ఐక్లాస్ కబుర్లు సెప్పనూ జెప్పడు! పేదోడి కర్సుమీద బతికీసీ పెదబాబులం; మ న కి సిగ్గెందుకు, లజ్జెందుకు?!” అన్నాడు యువక లీడరు తీవ్రంగా, తన ఏనాటి పేదరికాన్నో దేన్నో ఎందుకోగాని అకస్మాత్తుగా జ్ఞప్తికి తెచ్చుకున్నవాళ్ళా.

“షటప్ షటప్!” అని అతణ్ని అనేసేదే కాని, మూర్తికవి అతని కోపం చూసి కొంచెం భయపడి, తను అలా భయపడినందుకు లోలోపల చాలా చిరాకు పడ్డాడు. కాని, యువక లీడరు అంతలోనే తన మామూలు ధోరణ్లో పడి,

"ఏంటంటావ్ బాబ్జీ? నే చెప్పింది రైటేనా ?" అని అడిగేడు డాక్టర్ని.

"రైట్" అన్నాడు డాక్టరు మందహాసం చేసి.

"మనందరం దొంగ రాస్కెల్స్మేనా ?"

"రాస్కెల్నని తెలుసుకునీ రాస్కెల్లా ఉండగలిగినవాడే అసలైన రాస్కెలు" అన్నాడు డాక్టరు రాస్కెలిజం రహస్యాన్ని విస్పష్టం చేస్తూ.

"ఆ సంగతి దాసిపెట్టి మూతేసి పైకి మాత్రం బూతదయా ప్రేతకరుణా దేవ భక్తీ కబుర్లు జెప్పినోడే మనకి సిసలైన లీడరు; అలాటి రాత రాసినోడే మన కసలైన కపేశ్వరుడు! ఏం కపీ? ఏం టంటావు ?" అని ఉద్ఘాటించి ప్రశ్నించేడు యువక లీడరు.

కవి జవాబివ్వలేదు.

"ఆయన్ని వేరే అడగడం ఎందుకూ? ఆయన మన కవే!" అన్నాడు డాక్టరు.

"అవును, దిబ్బకవీ? నువ్వు మా మార్కు మచ్చల పులివి, మా బ్రాండు నెత్తుటి గెద్దవి; మా ఎస్టేటుకి సొంత కవ్వి! ఏదీ చిన్న షేకు?" అంటూ ముందుకి వంగి కవి హస్తాన్ని పట్టుకు ఊపేడు లీడరు.

అద్దెకి తెచ్చుకున్న ఆడదాన్దగ్గర దుస్తులు విప్పే పెద్దమనిషిలా వెకిలిగా నవ్వేడు మూర్తికవి.

"కథ చదవమంటారా!" అని అడిగేడు కథకుడు. చదవడం మానేస్తే బావుంటుందేమోననే అనుమానం ధ్వనించిందా ప్రశ్నలో.

"చదవండీ! దానికేం?" అన్నాడు కవి కళ్ళు పెద్దవి చేసి అమాయకంగా చూస్తూ.

"కామిక్కేనా ?" అని అడిగేడు యువకలీడరు. కుర్చీలో సావధానంగా చేర్లబడుతూ.

"టైం వేస్ట్ చెయ్యక చదవండి బాబూ !" అన్నాడు మూర్తికవి.

కథకుడు గొంతుక సవరించుకున్నాడు.

"నా చిన్నప్పుడు బియ్యేన్నా రింజను గొంతుకు సవరించుకు బైలెళ్ళిందంటే సచ్చుడిదాని తిట్టులా పరిగెట్టే దన్నమాట ! అలాటి రెయిలింజన్లే లేవిప్పుడు," అని వాపోయాడు యువకలీడరు.

కథకుడు గొంతుక మళ్ళీ సవరించుకున్నాడు.

"నీ గొంతుకు బంగారం గాను ! మరింక సవరించక లంకించు కోవయ్యా ! మానో ళ్ళూరకే ఉండవు. ఏవో అంటుంటాం. నీ పని నడూసుపోవడవేఁ !" అని సలహా ఇచ్చేడు యువకలీడరు.

కథకుడు నెమ్మదిగా చదవడం ప్రారంభించేడు. మధ్య మధ్య మూర్తికవీ యువకలీడరూ అడ్డొచ్చినప్పుడు వాళ్ళ సంభాషణ పూర్తయే దాకా పేషెంట్‌గా ఆగుతూ ఆ తరవాత మళ్ళీ చదవడం మొదలెడుతున్నాడు. తొల్త కొంచెం తెచ్చిపెట్టుకున్న కంఠంతో చదివినా.... వెన్వెంటనే మామూలు దోరణిలో పడ్డాడు.

అ త ని క థ :

"రొ ట్టె ము క్క"

("అదేంటది ?"

"అది కథ పేర్రా, లీడరూ !"

"రొట్టెముక్కమీద కతేంటయ్యా ?"

"ఆయన కాకి ముక్కుమీదా పండు తొక్కమీదా రాసుకుంటాడు. నీకేం ?"

"ఇదేంటయ్యా ఇది ?!"

"కథ విను."

"కానీ !")

కల్లురొట్టెకీ కాంతమ్మ కన్నీటికీ చాలా సంబంధం ఉంది.

("కల్లుతోనే మొదలెట్టేవా, పిట్టకవీ !"

"అద్దుతగలకురా, రవికల్లిడరూ !")

ఇప్పటి కాంతమ్మ ఆనాదేనాడో మీరు చూసిన కాంతమ్మలా లేదు.

("పేరు బాగోలేదు, పిట్టకవీ "

"పోనీ, మనిషి బావుంటుందేమో !")

మీరావిణ్ని చూసినా పోల్చలేరిప్పుడు.

అంతగా మారిపోయిందామె.

("పళ్ళ చిన్నమ్మి కూతురలాగ్గే ! నిరుటికింకా ఉల్లిపిచికిలా ఉంది. మొన్నజూస్తే పచ్చ గుర్రంలా పిటపిటలాడు తూంది.

"ఇంతకీ ఆయన కాంత మ్మెలా ఉంటుందో ఆయన్ని చెప్ప నిస్తావా ? చెప్పనియ్యవా ?

"ఆఁ ? చదుచదు కవీ !"

"మరింక మీ కాంతం ఎలా ఉంటుందో చెప్పండి గురూజీ ! వినాలని మాకు సర్దాగా ఉంది.")

ఇప్పు డా కాంతమ్మ—

పదేళ్ళనుంచీ పడుపు వృత్తి చేస్తూ

కుళ్ళిపోయిన మీ అప్పలా ఉంది ; ఎనాడో భర్త చనిపోగా తిండిలేక తిరిగితిరిగి చెడిపోయి చెదపట్టిన మీ తల్లిలా ఉంది.

("ఎవరిమీద బాబూ ఈ దెబ్బ ?"

"గురువుగారు ఎవరిమీదో దుఃఖం కొద్దీ రాసినట్టున్నారు."

"ఇంతకీ నీ యప్ప ఏం చేస్తూంది ?"

"మీ అమ్మ, అయామె సారీ, ఆ మీ తల్లి ఏం చేసేది ?")

పెనిమిటి పోయేక ఆవిడ పది రోజులు పస్తు పడుక్కుంది. ఆ తరవాత తిండికోసం వెతుకులాడుతూ ఆవిడ పైవారికి వండడానికి కుదురుకొంది. ఉల్లివంకాయా, కోడిపులావూ కూడా ఆనాడు పూల రెమ్మల్లా ఉండే తన చేతుల్తో ఆవిడ అమృతంలా తయారు చేయ గలిగేది.

ఇరవయ్యేళ్ళ కిందట ఇరవయ్యేళ్ళ వయసులో నగలబాబుగారింట్లో పని చేస్తోన్నప్పుడు ఆమె కంచుతో చేసిన వీనస్ విగ్రహంలా (విరియ బూచిన మందార మొక్కలా) ఎలా ఉండేదో తెలుసుకోవా లంటే ఆమెతో క్రీడించిన బాబుగారి పెద్దకుమారుడుగార్ని మీరు పని గట్టుకు వెళ్ళి ప్రత్యేకంగా అడగక్కర్లేదు.

"(ఫోటో లున్నా యేంటి ?"

"జోగులప్ప కూతుల్లాంటి వనా నీ ఉద్దేశం ?"

"ఎవర్తయినా సరే, దానిలా దిగజారి తేసేగాని నీకు నప్ప దురా దిబ్బకవీ ! నాకు తెలుసు !")

పెద్ద కుమారుడుగారు ఆ రోజుల్లో "రాజభోగం" అనే పుస్తకం రాసేరు. అప్పట్లో అది ప్రైవేటు సర్క్యులేషనులో ఉండేది. ఇటీవల అది ప్రపంచ్చేరిలో అచ్చయి విద్యార్థి లోకానికి చిచ్చులా తగులు కొంది. పనిమనిషితో సరాచకాలు, విద్యార్థినితో విలాసాలు, పూజా రిణితో పులకరింతలు, కూలిదానితో కాలక్షేపం—ఈవిధంగా అందులో రెండు డజన్ల అధ్యాయా లున్నాయి. అందులో ఛాప్టరు — "వంట దానితో వయ్యారాలు"—చదివితే ఆ రోజుల్లో కాంతమ్మ ఎలా ఉండేదో మీకే తెలుస్తుంది. ఆవిణ్ని అంత విపులంగా తెరమరుగు లేకుండా మీ

తనివంతా తీరేలా వర్ణించే డా రాజభోగి. ఛాప్టర్ చివర్న "వంట మనిషితో భోగం వైకుంఠ భోగం" అనేది ఆయన వెలిబుచ్చిన సదభిప్రాయం : ఆయన డిసర్నింగ్ టేస్టుకి నిదర్శనం.

("ఆ పుస్తకం నిజంగా ఉందేంటి కతల కవీ ?"

'అవి లేమరా లీడరూ ! అలాటి వున్నాయి. నన్నడుగు."

"అమ్మ, దిబ్బకవీ ! మరైతే నా కిచ్చేవు కా వేం ?"

ముం దతని కథ విను."

"నువ్వు దొంగవి."

"ఇచ్చినా, నువ్వు చదవలేవు."

"కూడబలుక్కు చదువుతాను."

"ముసిలాడి వయేక ముగిస్తావు."

"పోనీ ! చదివ్వినిపించ కూడదా ?"

"అధిక ప్రసంగం చెయ్యకు."

"నాకు చదవ్వు, బడాబాబునైతే అప్పజెప్పగలవు."

"నోర్మూయ్ !"

"ఆ డోకేయాలో ఏంటో అయి బక్కురకండా, చక్కా అలాటి కతలైనా రాయకూడదా ? రాసి, దేశంమీదికి ఒగ్గేవూఁ అంటే కామిక్కులుకూడా ఆగవు."

"ఆయన కథ విన్రా, బాబూ ?"

"ఇదేదో ఆకలి కతలా గుంది. బేగి కానియ్యి, పిట్టకవీ !")

కాని కాలం ఒక్కక్షణమైనా నిలవదు. ఎల్లప్పుడూ ఒక్కలా ఉండదు. కాలంతోపాటు వంటమనుషులు కూడా మారిపోతారు.

("ఆడదాన్తో ఉన్న తంటాయే అది. ఇయ్యాళున్నట్టు రేపుండదు"

"నేడు వికసించి విజృంభించును. రేపు వాలి వాడి పడిపోవును."

"గట్టి తిండి తగిత్తే మాత్రం దౌర్భాని పువ్వుల్లా పెట్టంగుం టారు."

"ఎంత రాయిలాటదైనా నీ హస్తం పడితే మర్నాటికి నుసి. అది యంతయు నీ రోగమహిమ."

"నీ దగ్గిర ఏ మైమూలేదు. నంచార్ధనం పువ్వువి."

"పదవండి సార్ !")

రాజభోగులు చింతకొమ్మల్లా చిరకాలం మిగిలిపోయినా, గతిలేని వారి పనిమనుషులు మాత్రం, ఆ భోగుల అనుగ్రహం తప్పేక, చిల కలు కొట్టిన పరువు కాయల్లా నేలకి రాలి చితికిపోయి, చివికిపోయి, చివరకి కుళ్ళిపోతారు. అయిదో ఛాప్టర్ నాయకురాలైన కాంతమ్మ ఆ పుస్తకంలోలా ఇప్పుడు కలకల్లాడుతూనూలేదు, వంటమనిషిగానూ లేదు.

("కంపెనీ పెట్టిందా ?"

"లేక, హైరో డ్డెక్కిందా ?")

కొన్నాళ్లావిడ, తన వంటిమీద లేచే మచ్చలూ, కొంకర్లుపోబోయే వ్రేళ్లూ కనిపించకుండా చీకట్లో చెట్ల నీడల చాటున నిలబడి రోడ్డంట పోయే నిన్నూ నన్నూ పిలుస్తూ కాలక్షేపం చేసింది. నువ్వప్పుడావిణ్ని చూసే ఉంటావు. కాని నీకు "క్లాసు" కావాలి కాబట్టి మరోచోటుకి పోయేవు. బ్రదర్! నీ హైక్లాస్ చేస్టే నీ అదృష్టం. నువ్వారాత్రి ఆవిడ దగ్గిరికి పోలేదు కాబట్టి ఘోరమైన ప్రమాదం తప్పింది నీకు. కాని, నువ్వు ఊరిస్తూ కథలు రాసి రెచ్చగొట్టిన విద్యార్థులూ, నువ్వు నీ నీడ చాటున అమ్మించిన దొంగసారా తాగి నువ్వు చూపించే బూతుబొమ్మల

భరతనాట్యాలు చూసి కైపెక్కిన కూలీలూ మనసులు కట్టుకోలేక ఆవిడ దగ్గిరికి పరిగెట్టేరు. వాళ్ళందరికీ ఆవిడ సరిసమానంగా ఘడియ ఘడియ సుఖమిచ్చింది, భయంకరమైన వ్యాధినిచ్చింది. అవును, వాళ్ళందర్నీ ఆవిడ దగాచేసి ద్రోహం చేసిందంటావా ? అటువంటి పాపిష్ఠి లంజల్ని షూట్ చెయ్యాలంటావా?

లేదు, గురూజీ, లేదు. నువ్వు స్థాపించిన ధర్మమే ఆవిడ పాటించింది. నీ వ్యాపార సిద్ధాంతపు మూలసూత్రాన్నే ఆవిడ అమలుపరచింది.

"అలాక్కసరుకన్చెప్పి మళ్ళీ కొట్టుదగ్గిర కొచ్చేవంటే తంతాను' సరుకు చూసుకున్నావు. కొనుక్కున్నావు. సరుకు సరిగ్గా చూసుకోకపోతే, అది నీ తప్పా ? నా తప్పా ? ఏంటి గురూ ?" — కొనేవాడా బహూపరాక్ ! బహూపరాక్ !

అది నీ రూలే ! నువ్వు పెట్టిందే! అంచేత ఆవిణ్ని నిందించకు అందుచేత —

జబ్బు తగులుకుందంటే ఆవిడకీ తప్పులేదు. నీదీ తప్పులేదు. వెళ్ళినవాడు వాడి ఇష్టంకొద్దీ వెళ్ళేడు. వాడి కర్మకొద్దీ తగుల్చుకున్నాడు. అంచేత ఇటువంటి డర్టీ సార్డిడ్ స్టోరీస్‌లో నీ పాత్రేమీలేదు. ఇటువంటి "లోక్లాస్" నీచపు వ్యవహారాల్తో నీకు ఏ విధమైన సంబంధమూ లేదు — ఏం ? అంతేకదూ?

("ఓయోయ్ ! పొట్టికతల పిట్టకవీ ! ఇదేంటి కతా ? లేక, మీటింగా !"

"అయినా, "థీం" కొంచెంఘాటుగా ఉంది గురూజీ !"

"పెద్దలగిర చనువుతే మర్యాద లుండవు. నీకు బత్తేలు కిట్టవు."

"చాలా ప్రచారాత్మకంగా ఉంది కూడాను."

"ప్రెచారం జేసినా: అమ్మకి దండం పెట్టు. అయ్యకి కాళ్ళు పట్టు. దేవుడికి పలారం ఎట్టు—అలా ప్రచారం జెయ్యాలగాని, ఇదే టిది ?"

"కథా వస్తువులో ఉన్న లోటు కథని తినేస్తోంది."

"ఎత్తుకోడవేఁ కల్లుతో ఎత్తు కున్నావు."

"మూలంలోనే దెబ్బింగి. అలా ఉండకూడదు. దీంలో కొంత మర్యాదా ఉండాలి. సంప్రదాయ సిద్ధమైన కొన్ని సాహిత్య సాంప్ర దాయాల్ని కొంతయినా మనం గౌరవించాలి. ఫర్ ఇన్‌స్టెన్స్-వస్తువులో కొంత ఉదాత్తత, కొంత డిగ్నిటీ ఉండాలి. దానికి ఆపోజిట్ తీసుకు చూడండి! మనం పొద్దున్నే కాల కృత్యాలు తీర్చుకుంటాం. అలా చెయ్యకుండా మనం బతకలేం. అది సత్యవేఁ! సత్యవేఁ కదా అన్చెప్పి కాలకృత్యాల గురించి మనం కథలూ కావ్యాలూ రాయలేం కద!"

"ఆ పన్లన్నీ ఎక్కడో చేసుకోక అయన్నీ ఊరోళ్ళంద ర్నెత్తులమీదా ఏస్తే—ఒద్దురా లంజకొడకల్లారా, అలాటి పాడుపన్లు చెయ్య కండ్రా, అన్చెప్పి రాయొద్దా ?! అయేం మాటల్లే! అసలు సంగతది గాదు పిట్టకవీ! ఇలాటి ఆకలీ జబ్బూ కతల్రాసి నువ్వు మాలాటి పెద్దల సర్దా అంతా శెడగొడుతున్నావు."

"కావ్యంతో ఒకర్ని సుఖపెట్టాలే కాని ఎవర్నీ దుఃఖపెట్ట కూడదు."

"ఇట్లర్‌గాణ్ణాటాణ్నయినా ఆడిమీద పజ్జా ల్రాసి ఆళ్ళోకూడా మంచుం దనే చెప్పాల, ఆణ్ణి పొడిశే మని చెప్పకూడదు."

"ఆ మాటలోకూడా సబువు లేకపోలేదు. కొడుకుని హిరణ్య కశిపుడు హింసించేడు కాబట్టి "ఓయ్ ప్రహ్లాదుడూ! నువ్వుకూడా మీ నాన్నని అలానే హింసించు!" అని మనం చెప్పకూడదు కద."

"ఆ పన్లన్నీ మనం దేవుడికే ఒగ్గెయ్యాల."

"ఇంతకీ నేను చెప్పే దేంటంటే...."

"కతరాస్తే మా దిబ్బకవికూడా చాలా మంచో డనే రాయాల, అదేనేం జెప్పేది."

"మంచీ చెడ్డా అనేవి మానవుల్లో...."

"సాజంగా ఉంటాయి. అంచేత మేనంతా డాట్రుబాబు గుండులా అందంగా ఉన్నామనే రాయాల,...."

"షటప్!"

"కాని, నూలోపల కుళ్ళుందని రాయగూడదు."

"నోర్ముయ్."

"గున్న మామిడిచెట్టు గున్నమ్మ కూతుర్లా ఉందని జోకు జోకాలే కాని, గురవరాజుగాడు దాని కాణీ పండు రూపాయి కమ్ము తున్నాడని ఆణ్ణి ఏక్కూడదు."

"కథ చదవండి గురూజీ! వాడితో మన కేమిటి?")

నీది తప్పయిలి ఎవరిది తప్పయినా కాంతమ్మ మాత్రం ఇప్పుడు రోడ్డు పక్క చెట్లనీడల్లోంచి పైకివచ్చి నాలుగురోడ్ల జంక్షన్‌కి నడిచి చివెళ్ళి ఆక్కడ ఒక పక్క అత్యంతాకర్షనీయంగా నిలబడ్డ మాతా అన్నపూర్ణేశ్వరీ బ్రాహ్మణభోజన కాఫీ పలహారశాల దగ్గిర గంటల తరబడి ముష్టెత్తుతోంది. "రాజభోగు" లంతా కార్లుదిగి లోనికి వెళ్ళి నప్పుడో, కాఫీ తాగి లేక భోంచేసి బైటికి వచ్చినప్పుడో ఆవిడికి నయా నయాపైసలిస్తున్నారు.

("ఇంకా కష్టాలెట్టకండా దాన్ని వేగి చంపేద్దూ, పొట్టికతల పిట్టకనీ !"

"ఏం ? డబ్బావేగిరంఒల్చుకుందావ(సనా ? ఒదలకండి, గురూజీ ! మనవాడికి ఇంకా డబ్బా రాసి బోర్ కొట్టంది")

ఈ విధంగా జీవిస్తూ బతకాలని లేదు కాంతమ్మకి. కాని ఏనాడో ఎప్పుడో చావకుండా కాంతమ్మ ఈ నాటికీ ఇంకా ఇలా మిగిలుండడంటే అందుకు పన్నెండేళ్ళ కారణం ఆవిడ పెద్దకొడుకు; పదేళ్ళ కారణం చిన్నకొడుకు.

("ఒరే లీడరూ ! కొడుకులు కూడా ఒచ్చేరు నీ పీకలమీదికి ! మరింక కాస్కో!"

"కామిక్కుల్రాయక, తీరి కూర్చుని మమ్మల్నెందుకిలా చంపు తావు, పిట్టకవీ ?!"

"ఆయనిష్టం వచ్చింది ఆయ(నాసుకుంటాడు. నీకేం? ఇది ప్రజా రాజ్యం! నువ్వెవడి వడగడానికి?"

"ఇలాటి కతలన్నీ ఆపడం ఎలా బాబ్జీ?"

"ఇదేం హిట్లర్రాజ్యం కాదు."

"అదొచ్చినా, మనకి డక్కా ఉండదుకద! ఒచ్చినా బావుణ్ను."

"రావాలని దేవుడికి దండం పెట్టుకూర్చుందావా( ? ఏ(రా? ... మీరు చదవండి సాబ్ !)

పెద్దవాడి పేరు అంజిగాడు. రెండోవాడికి ప్రత్యేకంగా పేరంటూ లేదు.

"ఒరే, చిన్నా!", "ఒరే, చచ్చినాడా!" అలా వాణ్ణి పిల్చుకో వచ్చు.

("కాని, ఓయ్ కవీ! జబ్బుదానికీ పిల్లలే ?!"

"మొగుడు పోయేక్కూడాను!")

కాంతమ్మ విధవదే, జబ్బుదే, ముష్టిదే. కాని ఆవిడకి పిల్లలున్నారు. అలా ఎంతమందికి లేరు?!

ఎంతోమంది అలా ఉన్నారు కాబట్టే ఇటీవల ఇక్కడ కొచ్చిన పాశ్చాత్య విజ్ఞాన ధనులు జీవితానికి సెక్సే ప్రధానంకాని అకలనేది ప్రధానంకాదని కనిపెట్టి ఆ పరమ సత్యాన్ని మనకోసం ప్రచారంచేసి మన విజ్ఞాన సంపదని వృద్ధి చేసేరు. ఆకలేస్తే మేఁవేఁ చస్తాం కాని, బూతు లేకపోతే లోకమేఁ చస్తుంది కద! అందుచేత ఆకలి వేసిన వాళ్ళు పిట్టల్లా రాలిపోతున్నావాళ్ళకి పుట్టేవాళ్ళు పుడుతూనే ఉన్నారు కాబట్టి నీకు కాళ్ళు పట్టడానికీ, బళ్ళు తోలడానికీ,రిక్షాల్లాగడానికీ,ఆ కంపెనీలో కూలీల కిందా ఈ కంపెనీలో ముండలకిందా చేరడానికీ నీకు చవగ్గా జనం ఉంటాయంటారు, ఉండకపోరు. ఇదంతా నీ మంచికే. అంచేత మరేం భయపడకు!

(డాక్టరూ! దిబ్బకవీ! ఇదంతా మనమీద్దెబ్బలా అవుపిస్తంది.")

మరొక సంగతి— ప్రాణఁ వనేది కారుచౌక పదార్థ వేఁకాదు, చాలా గట్టి పదార్థం కూడాను. యుద్ధాలు, రోగాలు, కాటకాలు— ఎన్నొచ్చినా అలగాజనం అలా ఇంకా బతికేస్తూనే ఉన్నారు. దేర్ ఈజ్ సమ్థింగ్ వన్డర్ఫుల్ అబౌట్ లైఫ్! గాలి మాత్రం భక్షించి కనీసం కొన్నాళ్ళయినా కాలం గడపగలదు ప్రాణం. గ్లోరియస్, గ్లోరియస్!

అన్డ్—

సో చీప్! సో వెరి చీప్!

ఆ కాంతమ్మ రెండో కొడుకు చూడండి! ఆస్పత్రిలో సీటు లేక పోయినా, నాడి చూసే వైద్యుల్లేక పోయినా, కడుపుకి మందు చుక్కయినా లేకపోయినా, ముప్పయ్ రోజులు పస్తుండి "టైఫాయిడ్ జొరాన్ని"

నిగ్రహించుకుని లేచి ఎలా కూర్చోగలిగేదో చూడండి. కాణీ ఖర్చవకుండా క్యూర్ అయిపోయేదు. స్పిరిటంటే అదీ స్పిరిటు. పౌరుషమంటే అదీ పౌరుషం.

ఊరవతల కల్లుపాకలు పూర్వం ఉండేచోట ఓ కమ్మలపాక అద్దెకి తీసుకొంది కాంతమ్మ, బతకాలంటే వైరాగిసత్రంలో బతికేయొచ్చు, కాని పిల్లలమీద ఆపేక్షకొద్దీ వేరే ఓ పాక అద్దెకి తీసుకొంది. అక్కడికి వెళ్ళాలంటే నువ్వు పందుల గుంటల్నీ, కుక్కల శవాల కంపునీ, పాత ఎముకల పోగుల్నీ, కుళ్ళిన చెత్తనీ, కోళ్ళ ఈకెల్నీ, మనిషి రొచ్చునీ, గాలికి లేచే దుమ్ముధూళినీ దాసుకొని, దాటుకొని, గెంతుకొని ముక్కుమూసుకు వెళ్ళాలి. అలా వెళ్ళి అందులో వెయ్యి పాకల మధ్య ఓ పాక ముందు నిలబడి నడుం వంచి వంగి చూస్తే నీకు ఆ పాక చూరుకింద నడవలో నులకమంచం మీద రెండు కళ్ళు కనిపిస్తాయి. వాటిపైన పింజలు పింజలుగా ఎర్ర జుట్టుంటుంది. వాటి మధ్యనించి లేచిన పెద్ద ముక్కుకింద చిన్న నోరు నాలుగు వారాల పస్తుతో సాగిపోగా పుర్రెలోంచి పళ్ళు కనిపిస్తాయి. ఆ సమూహమే కాంతమ్మ రెండో కొడుకు, అతని చేతిలో చిన్న కల్లు రొట్టె కూడా కనిపిస్తుంది నీకు. పొద్దున్న వాళ్ళమ్మ బేడిచ్చి కొనితెచ్చి కొడుక్కిచ్చి ముష్టికి వెళ్ళింది. ఇప్పుడు జరగబోయే విషయం గురించి కబురు తెలిసేక మళ్ళీ వస్తుంది. ఇప్పుడు ఉదయం తొమ్మిది గంటలయింది కాబట్టి నువ్వు సిమిలీ చెప్పడానికి వీలుగా, "భగవంతుడి సరిసమానమైన చూపులా" వేసవి సూర్యుడు రాజుగారి మేడ మీదా, వాడలో పాకమీదా కూడా ఒకేరీతిగా వెచ్చగా ప్రసరిస్తున్నాడు_కదామరి! కాంతమ్మ రెండో కొడు కిప్పుడు_దయచేసి ఇంకాకొంచెం వంగి చూడండి సరిగా కనిపిస్తుంది_నులక మంచం మీద కూర్చొని కల్లురొట్టెని కమ్మగా వాసన

చూస్తున్నాడు, మృదువుగా నిమురుతున్నాడు. అతనికి ఆ కల్లు రొట్టె నీ ప్రియురాలి అధరంలా అతి మృదువుగాలేదు; నీ రంగైన నెరజాణ సిగలోని పూవులా కమ్మగా లేదు; ఆడదాని రొమ్ములకంటె గట్టిది మరేదీ పుట్టని నీ పెద్దబాబుల అరచేతుల్లా అతి మెత్తగాలేదు. ఆ సమయంలో అతని కది తనెప్పుడో తాగితాగి మర్చిపోయిన తల్లిరొమ్ములా, తన నెప్పుడో ఎవరో ఒక్కసారి మాత్రం పితకనిచ్చిన ఆవు పొదుగులా, తను అంతదాకా ఎన్నడూ చూడని తన ఆరోప్రాణంలా అతి హాయిగా ఉంది.

("అందులో కొంత సెక్సు పెట్టేరే గురువుగారు."
"తల్లి పొదుగులోకూడా సెక్సేచూసేవురా, దిబ్బకవీ !?")

కల్లు రొట్టెలో కైలాసంకూడా చూడగలిగిన వాళ్ళల్లో కాంతమ్మ చిన్న కొడుకొకడు. అదెలా జరిగిందంటే :

("ఇంకా ఉందాండి కథ ?")

ఒక్క క్షణం ఇలాచూడండి. కాంతమ్మ పెద్దకొడుకు అంజిగాణ్ని చూడండి. అడుగో అల్లక్కడ! కాకిలా ఉన్నాడు. దేగలా వస్తున్నాడు. చాలా ఆకలి మీదున్నట్టు లేడూ ? అవును చాలా ఆకలి మీదే ఉన్నాడు.

నాలుగురోజుల కిందట కాబోలువాణ్ని పోలీసువాళ్ళు మూసేసి నాలుగురోజులు, అనుమానం మీద, కొట్లో కూర్చోబెట్టేరు. కొంత కొంత తిండి పెట్టేరు. ఇవాళ పొద్దున్న "ఒరే అంజీ ! పోరా!" అన్నారు. అధికార్ల ఆగ్రహానుగ్రహాలకి ఏవేవో కారణా లుంటాయి. ఉండకపోవు. కాని అవేవీ అంజిగాడికి తెలియవు. వాడు కోపంమీదా ఆకలితోనూ ఉన్నాడు. "అది తప్పు ! అలా కోపంమీదా ఆకలితోనూ ఉండకూడదు ! ఛ ! ఎందుకా కోపం ? ! ఎందుకా ఆకలి ? ! తిన్నగా

బుద్ధిగా ఎందుకుండరు వీళ్ళంతా ? వె ఆర్ బ్రూట్స్ ! నో నో నో !
నాకు అడ్డురాకు. వాళ్ళు పరమ బ్రూట్స్ ! అది నిజం ! అలాకాదని
వెయ్యిచెప్పండి లక్ష చెప్పండి, నే న్నమ్మను," అంటారా ?

అనండి, కాని కథ వినండి. ఓసంగతి చెప్తాను. నా మీద కోపం
తెచ్చుకోకండి. చాలామంది చాలాసార్లు ఆ సంగతప్పుడే చెప్పేరు.
పెద్ద గొప్ప విశేషం ఏం లే దందులో; కానిమళ్ళీ చెప్తున్నాను. నా
మనస్సుకు తృప్తికోసం మరొక్కసారి చెప్పనీయండి. అదేవిటంటే
ఆకలిమీదున్నవాడు లోకంమీద పెనుకోపంతో ఉంటాడు.

అందుగురించి నన్ను కోప్పడ్డం మీకు భావ్యంకాదు. అందుకు
నేనేంచెయ్యన్చెప్పండి ? నేనేం దేవుణ్ణా ?

అందేత—ఇంతకీ చెప్పొచ్చేదేవిటంటే—ఆకల్తో ఉన్న అంజి
గాడు వస్తూనే తమ్ముడి చేతులోఉన్న కల్లు రొట్టెని గెద్దలా తన్నుకు
పోయి ఒక్క కొరుకుతో దాన్లో పావుముక్క కొరికి మెత్తగా నవ్వుతూ
నిలబడ్డాడు. తమ్ముడుకూడా పెను ఆకల్తో ఉన్నాడనే విషయం కని
పెట్టలేక పోయాడు. కనుక్కొనే స్థితిలో ఉండజాలక పోయేడు.

మైడియర్ హైక్లాస్ యంగ్ ఫ్రెండ్ !

("మళ్ళీ లెక్చరు మొదలెట్టావ్ ?")

అది కల్లురొట్టె. అది అతి చిన్నదే. దాని ఖరీదుకూడా బేడ్డబ్బులే.
అదెక్కడపడితే అక్కడ బజార్లోదొరుకు తున్నదే. దానికోసం
ప్రాణాలు పోవడం చాలా అసందర్భవేఁ. అవునంతే. అది నిజవేఁ,
నువొప్పుకుంటావు.

-కాని, ఇక్కడే, ఈ పూళ్ళోనే, ఈ రోజే, ఈ ఉదయవేఁ ఆ
పాకలో—ఆ కల్లు రొట్టెకోసం ఆ తమ్ముడు వేసిన కేకవింటే నువ్వలా
నివ్వెరపోయి నిలబడి పోతావు; దాని కోసం ఆ అన్న దమ్ముల పోరా

టం. ఘోరయుద్ధం చూస్తే భయంతో గడగడ వణికి పోతూ ఆ పోట్లాట ఆపొచ్చునని కూడా మర్చిపోతావు; అంబలితినే కంచుగిన్నె చిన్నవాడి **చే**తిలోంచి పెద్దవాడి తలమీదికి ఎగిరి ఢీకొనగా కారినరక్తం చూసి ఎక్కడున్నవాడక్కడ ఎలా వున్న వాడలా కొయ్యబారి పోతావు : కిందనిపడ్డ కంచుగిన్నె తీసి గదలా గొడ్డల్లా ఎత్తి, వెర్రి వాళ్ళా ఆ తమ్ముణ్ణి నులక మంచం మీదికి తోసి నొక్కిపెట్టి, ఆ ఆయుధంతో ఆ పెద్దవాడు ఆ చిన్నవాడి తలమీద మృత్యుభీకరంగా ఎలా మోదేదో. బాదేదో చూస్తే—మృదుజీవీ !—నువ్వు మూర్ఛపోతావు.

కొంత సేపయేక, నువ్వు తెప్పరిల్లి తేరుకున్నాక, అక్కడ మంచంమీద పడుకున్న పదేళ్ళ లేలేతశవాన్నీ మంచం మీదా. మంచం కిందా మంచంపక్కలాపడి ఇంకా సరిగా ఆరని ఇంకని రక్తపు మర కల్నీ. మసుగుల్నీ. నెత్తురుతో తడిసి ఏడుస్తూ కూర్చున్న పన్నెండేండ్ల హంతకుణ్ణీ, అక్కడే చచ్చిన బతికిన కొడుకులమధ్య కూలబడి కూర్చుని పేళ్ళులేని మొండిచేతుల్తో గుండెలు బాదుకు ఏడ్చే ఆ తల్లినీ, అక్కడే ఆపక్కల్నే ముక్క ముక్కలుగా తెగిపోయి మట్టిలో నలిగి పోయి ధూళితో నిండిపోయి ఎర్రగా తడిసిపోయిన కల్లు రొట్టె ముక్కల్నీ. అక్కడ చిందర వందరగా చేరి, చివరికి కాకిమూకలా మూగి గొల్లున గోలచేసే చింకిచింకి ముఖాల్నీ 'చిల్లర చిల్లర' ప్రాణాల్నీ, ఆశ్మశానం లాటి వాడనీ, అందులో కమ్మల గోరీల్లాటి గుడిసెల్నీ ఆ మురికినీ పెంటనీ రొచ్చునీ రోతనీ అదంతా చూస్తోంటే నీ కళ్ళు తడి యవు. నీ గుండె కరగదు. నీ మనస్సక్కడ నిలవడానికి ఇష్టపడదు. నీ కదంతా చూస్తోంటే తలతిరిగి నట్టవుతుంది, కడుపులో వికారం పుడుతుంది. వాంతొచ్చేట్టవుతుంది,—అసహ్యం అసహ్యం —అసహ్యం పుట్టుకొస్తుంది. నువ్వంతట చటుక్కున వెనక్కితిరిగి పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ తొందరగా ఇంటికిచేరి, వేణ్ణీళ్ళస్నానం చేసి

చాకింటిబట్టు తొడుక్కొని ఆ వాడలో ఆ సీనంతా మర్చిపోవడానికి రెండు పెగ్గులు బిగించి పడుకుంటావు ; రాత్రే కాని మళ్ళీ లేవొద్దంటావు. ఆ పాపంలో నీకు పాలుందంటే లేదనేదాకా తంతానంటావు.

("అయిందాబాబూ, నీ కతా ?")

ఒక్క మాట !

("చెప్పండి.")

ఇది కథ. కాని ఇది నిత్యం అనుక్షణం నీ చుట్టూ జరుగుతూన్న ఒక చిన్న నిజాని కిది ప్రతిబింబం. ఇది మాత్రం నిజం.

("ఒప్పుకున్నాం.

"అయితే ఏఁవిఁటంటారు ఇంతకీ ?")

మరొకమాట.

("మరొకటా ? !")

ఈ విధంగాఉన్న సొసైటీ ఈ రోజే మంచికి మాకు మారాలి. ఈ దుర్భర పరిస్థితి ఇప్పుడే ఈ వెంటనే పోవాలి. మంచికాలం, ఎప్పుడో కాదు ఎప్పుడోకాదు, ఇప్పణ్నించే మాకు రావాలి. ఇది, మీ రెంత నద్దన్నా, ఇప్పుడే మాకు రావాలి !"

అని పూర్తిచేసి కాయితాలు మడిచి జేబులో పెట్టుకొని, రుమాల్తో ముఖం తుడుచుకున్నాడు కథకుడు.

"ఎలా ఉందంటారండీ ?" అని ముగ్గుర్నీ చూస్తూ అడిగేడు.

యువక లీడరు ఎందుకోగాని చాలా చిరాగ్గా ఉన్నాడు. కథ పూర్తయేసరికి చాలా కోపంతో కూడా ఉన్నాడు. కథకుడలా ప్రశ్నించగానే అతను కొరకొర లాడుతూ,

"ఆఁ ఆఁ ! బేద్రొట్టిమీద నువ్వు దమ్మిడీ కత రాసేవన్జెప్పి లోకం మారి పోద్ది ! మా... రి....పో....ద్ది !" అంటూ వెటకారంగా చేతు లూపేడు.

అతని మాటల్ని ఎలా తీసుకోడమో తెలియక తికమకపడుతూ కూర్చున్నాడు కథకుడు. అంతవరకూ_తనింట్లో చిక్కుకునే పురుగుని సాలీడు చూసినట్టుగా, తన చేతుల్లోంచి ఎలాగా తప్పించుకోలేని చందన దాసుని చాణక్యుడు చూసినట్టుగా_కథకుణ్ని చూస్తూ కూర్చున్న డాక్టరు అతన్ని, "కథ పబ్లిష్ చేస్తే ఎంతిస్తారు మీకు ?" అని చిరు నవ్వు నవ్వుతూ అడిగేడు. ఆ నవ్వు, అస్త్రాలొదిలేసి రథం దిగిన కర్ణుణ్ని చూసి నవ్విన కృష్ణుడి నవ్వులాగా, అతిచిన్న క్యూబాని చూసి ఉదజని బాంబు నవ్విన వేళాకోళం నవ్వులాగా ఉంది.

"అయిదు రూపాయలిస్తారేమో" అన్నాడు కథకుడు కొంచెం ఆలోచించి.

"బేడ చొప్పున నలభై రొట్టెలు !"_అన్నాడు మూర్తికవి.

"కథ మీ మట్టుకు మీకెలా ఉంది ?" అని సూటిగా కవినే అడిగేడు కథకుడు. అతని ప్రశ్నలో ఆశ విడిచిన ఆఖరి నిట్టూర్పు ధ్వనించింది.

"నలభై రొట్టెలంటే మాటల్లండీ ! ఫరవాలేదు." అన్నాడు మూర్తికవి.

"ఆ స్టోరీకి ఇరవై ఇస్తాను." అన్నాడు చిరునవ్వుల డాక్టరు.

"ఏమిటి ? రొట్లా ?" అని హసించేడు కవి.

"కాదు, బక్స్, రూపాయ్లు."

"ఎందుకూ ? కథ మీరు పబ్లిష్ చేస్తారా ? !" అని ఆశ్చర్యం ప్రకటించేడు కథకుడు.

"చెయ్యను" అన్నాడు డాక్టరు.

"మరైతే, మీకెందుకూ ?"

"అందుకే !" అంటూ అతిస్పష్టంగా నవ్వేడు డాక్టరు. ఆ నవ్వు లోంచి వెటకారం కోరలోంచి రాలినట్టు రాలింది.

ఇవతలవాణ్ని అత నంత ఈజీగా అవమాన పర్చగలగడం చూసి కవి కొంచెం బెదిరినట్టున్నాడు. పాముని ముంగిసనీ చూసి తేలు ముణుచుకుపోయినట్టు ముణుచుకుపోయే డతను.

కథకుడు కొంతసేపు కదలకుండా మౌనంగా కూర్చున్నాడు. ఆ తరవాత బద్ధకంగా వళ్ళు విరుచుకొని తనకీ డాక్టర్‌కీ మధ్యనున్న బల్ల మీద సిగరెట్ నుసినీ ధూళినీ ఉఫ్ఫని నెమ్మదిగా ఊదిపారేసి, లేచి నిలబడి బట్టలు శుభ్రంగా దులుపుకొని "ఒస్తాను. థాంక్స్ ఆల్ ది సేమ్"అని అందరికీ చెప్పి వెళ్ళిపోయేడు.

అతను వెళ్ళేక కవి కుర్చీలోంచి తొందరగా లేచి గుమ్మందాకా వెళ్ళి కథకుడు వెళ్ళిపోయేడన్న సంగతి నిశ్చయం చేసుకుని, ఆ తర వాత రెండు చేతులూ జాస్తూ తొందరగా వెనక్కి వచ్చి యువక లీడర్ని కావిలించుకొని డాక్టర్ గారితో కర సంచలనం చేసేడు.

"ఒరే, రవికల్లీడరూ ! ఇవ్వవలసిన రీతిగా ఇచ్చేవురా గుంటడి గట్టి కిస్తా ! మెచ్చుకున్నాను ! మెచ్చు కున్నాను. లేకపోతే మనమీ ద్దెబ్బ తీస్తాట్ట దెబ్బ ! అయ్యా, డాక్టర్‌గారూ ! మీ రెంత అసాధ్యు లండీ ? ! అయ్య బాబోయ్ ! నే నెన్నడూ మీ రంత గట్టివా ళ్ళనుకో లేదనుకొండీ. ఒక్క ముక్కలో ఎంత మీనింగు ఎలా కుక్కేరండీ ! ఒక్కమాటే ! అయితేనేం ? బాంబు ప్రేల్చినట్టు పేల్చేరు. కళ్ళంటు కున్నాయ పిల్లడికి ! అలాటి టెంపర్‌గాళ్ళకి అలా తగలాల్లెండి ! తప్పు లేదు, లేపోతే ఓ కల్లు రొట్టెట ! ఇద్దరు కొట్టుకున్నారట ! ఒకడు చచ్చేట్ట ! అనాథజీవు లంతా ఆక్రందనం చేశారట. ఎవడి గుండే కరగలేదట ! వీడి కడుపు మాత్రం తరుక్కుపోయిందట. మధ్యని

సైడు దెబ్బలు మనకిట ! వీడి కడుపంత చెరువయిపోతే, కాయితం మీద కథలు గీకడానికి బదులు ఏ లంజలోద్ధరణ సంఘంలోనో ఏ కుష్ఠు రోగుల కష్టజీవుల సమాజంలోనో చేరి "ధర్మం చెయ్యండి బాబుల్లారా!" అని ఊరంతా చెడామడా తిరిగి ప్రచారం చేసుకుని సేవ చెయ్యకూడదూ ? కథ లెందుకు రాయడం ? మనమీద ఆ దెబ్బ లెందుకు తియ్యడం ? అయినా ఎక్కడో ఎవరో చస్తే దానికి మనదా పూచీ ? మనమీద వాడి కసి కనిపెట్టేరా ? వాడి ఊసెత్తేవాఁ ? వాడి జోలికి వెళ్ళేవాఁ ? అద్దే ! వాడొట్టి హింసమనిషండీ ! పెంపరూ దుర్మార్గం ! రెండూను ! అలాటి వాడికి, ఫరవాలేదు, ఖర్చు కివ్వవల్సిందే. బాగా ఇచ్చేరు మీరు వీడే ఆమధ్య ఈగ రెక్కా దోమ ముక్కూ అంటూ కథల్రాసేడు. ఎవడి లెవల్ వాడిది. దరిద్రుడికి దరిద్రం కథ తప్ప హయ్యర్ కథ లెలా వస్తాయి ? ఏఁవంటారు ? దరిద్రం అంటే మామూలు దరిద్రం కాదుసుమండీ. దరిద్రులంటే నాకూ ఉంది జాలి. ఆ ఫీల్డులోకి కథల్రాసి ప్రవేశించక్ఖర్లేదు. ఏఁవంటారు ? మనం చేసే సాయం మనవాఁ చేస్తాం. దాని గురించి కాదు. పావర్టీ ఆఫ్ మైండ్—మానసిక దారిద్ర్యం గురించి చెప్తున్నాను. బ్యూటీని చూళ్ళేని వాళ్ళంటే నా కసహ్యం. చూళ్ళేకపోవడం వాళ్ళ దురదృష్టంలెండి. వికసించిన పద్మాన్ని నేను చూస్తాను. పురుగు పట్టిన పువ్వుల్ని వాడు చూస్తాడు. ఏఁవంటారు ? పువ్వులికి పురుగులు పట్టడానికి మనం కాదూ కారణం ? ఏఁవంటారు? ఆ పురుగులం మనవేఁ అని చెప్పేటంత డేంజరస్ మనిషి వాడు !.... అమ్మమ్మమ్మ !! గొప్ప డేంజరస్ ఫెలో !! డాక్టరుగారూ ! ఒరే లీడరూ ! మంచిపని చేసేరు ! కిక్కుకొట్టి పంపించేసినట్టు పంపించేసేరు....అయినా డాక్టర్ జీ ! మీరు ఇంకొంచెం చల్లగా అంటిస్తే బావుండేదేమో ?! ఈ రైటర్ గాళ్ళతో చిక్కులున్నాయి. చేతిలో కాయితం కలం ఉంటాయి. మరింక కక్కడానికి విషం ఉంటే చాలు. అంటే

నాలాటి రైటర్స్ అలా చెయ్యరనుకోండి. అలాటి కసిగాళ్ళు ఏదైనా రాసీగల్రు, చేసీగల్రు."

"ఒరే కవీ! నీకున్న కసి నీకుంది. ఆడికున్న కసి ఆడికుంది. మరింక ఆడిమీద కసితో మమ్మల్నింకా చంపక అలా కూర్చో." అన్నాడు యువక లీడరు, మూర్తికవి లెక్చర్‌కి అడ్డువేస్తూ.

"అయినా ఆడు నిన్నూ నన్నూ ఏం పన్లేదు కద! డబ్బులున్న కంపినీవోళ్ళ నన్నాడు గాని మనల్ని అన్లేదే! సబు కంట్రాక్టుగాళ్ళం మనకేం బొచ్చింది? నిన్ను ఆడేం అన్లేదురా కవీ! గొప్పోళ్ళ లెక్కల్లో నిన్ను నువ్వెందుకలా జమకట్టుకుంటావు....ఇందాకల్లా నాలాగ!" అని కూడా గుణిసేడు యువక లీడరు.

కవి కుర్చీలో కూర్చొంటూ, "నేనేంవాణ్ని అన్లేదనుకోండి. నేనేమైనా అన్నప్పటికీ బావుండదుకూడాను. మర్యాదకి నష్టం. వాడి మర్యాదక్కాదు, మన మర్యాదకి నష్టం. అంచేతనే నేనలా డిగ్నిటీ మేన్టేన్ చేస్తూ కూర్చున్నాను. మీరుకూడా చక్కటి హైలెవెల్ మేన్టేన్ చేసేర్లెండి, మన రవికల్లీడరయినా దిగవలిసొచ్చింది కాబట్టి వాడి లెవెల్‌కి దిగి దెబ్బ తీసేడు. ఒక్కొక్కప్పుడు తప్పదులెండి. ఏం చేస్తాం? రాయి విసిరీ వాడిమీదికి పువ్వులు విసర్లేంకద! అయినా, డాక్టర్‌గారూ డబ్బిచ్చుకుంటాం రాయకండ్రా బాబుల్లారా! అని బతిమాలుకున్నా రాసేవాళ్ళ నేంచెయ్యడం అండీ? నాకు ఏ ఉపాయంకూడా తోచకుండా ఉంది స్మండీ! ఏం చెయ్యడం వాళ్ళని!" అని ప్రశ్నించేడు.

"షూట్ చెయ్యడంబెస్టు." అన్నాడు డాక్టరు సరదాగా, టూకీగా.

"అయ్య బాబోయ్ ! మీ రెలాగైనా గట్టివారండీ ! మీలాటివా ళ్ళుండితీరాలే ! అయినా, డాక్టరుగారూ; మనం అలాటి పన్లు చెయ్యొచ్చా ?" అంటూ ముద్దుగా హాస్యంగా అడిగేడు మూర్తికవి.

"చెయ్యకూడదు, చెయ్యించాల !" అంటూ యువకలీడరు అడ్డొచ్చి "ఒరే దిబ్బకపీ ! మా సొంత కపీ ! ఆడెవడో తెల్సా ?" అని అడిగేడు.

"ఎవడు?"

"ఆ పొట్టికతల పిట్టకవిగాడు,"

"ఆఁ : ఎవడు వాడు , మీ చుట్టవేంటి కొంపతీసి ?"

"ఛస్! ఆడు మనకి చుట్టవేంటి !"

"మరైతే, ఎవడు వాడు ?"

"ఆడు మన ఎగస్పార్టీ కవి" అన్నాడు యువకలీడరు సత్యాన్ని కనుక్కున్న సంతోషంతో, తను పెద్దవాడో చిన్నవాడో ఆలోచించి తేల్చుకున్న ఆనందంతో.

"ఉందిరా నీకు బుర్ర!" అంటూ లీడర్ని మెచ్చుకున్నాడు కవి.

అంతలో రాజసేనరావు విస్కీ, జిన్నులతో గదిలోకి వచ్చాడు. ఆ తరువాత గ్లాసులూ సోడాలూ రైసూ, రొట్టె సరంజామా సామగ్రి అంతా దిగింది.

రాత్రి పదిగంటలయింది. "చెరగూ మా సెరా" అనే జావళీ సరదాగా పాడుతూ తూల్తూ తూల్తూ అభినయం చేస్తున్నాడు మూర్తి కవి. యువకలీడరు నాయకుడిగా నటిస్తూ విట్టీగా మధ్య మధ్య ఛెణుకులు ఛెణుకుతున్నాడు. డాక్టరూ రాజసేనరావూ రాజూమంత్రుల్లా కూర్చొని చిరునవ్వులు వెదజల్లుతున్నారు. పైన పంకా, స్థూలకాయం వల్ల సరిగా తిరగలేని పెను సాలీడులా నెమ్మదిగా తిరుగుతోంది. ప్రియుల్ని చూసి పట్టజాలని సంతోషంతో మిల మిల్లాడే నాగుబాముల్లా మెరుస్తున్నాయి విద్యుద్దీపాలు.

●